సమాచార సేకరణలో ఖచ్చితత్వమే ప్రధానం

బంజారాహిల్స్: వార్తల సేకరణలో వేగంతో పాటు ఖచ్చితత్వం ప్రధానమని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్ డీజీ, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీలో మార్చి 9 వరకు జరిగే 'జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్' పై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా ఆధారంగా క్షణాల్లో సమాచారం ప్రపంచ చుట్టేస్తోందన్నారు. సూపర్ స్పీడ్‌తో పాటు సమాచార లోపం ఉండవద్దన్నారు. ప్రతి ఒక్కరి చేతిలో ఇంటర్నెట్‌తో కూడిన మొబైల్ ఫోన్ ఉందని, వారికి చేరే సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలన్నారు. ఫేక్‌న్యూస్ తొందరగా సమాజంలోకి వెళ్తుందని, ద్వారా పౌరులపై ప్రభావం చూపుతుందన్నారు. మీడియా ప్రతినిధులు సమాజ వికాసం కోసం బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలన్నారు. కోర్సు డైరెక్టర్ మాధవి రావులపాటి తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో దివ్యాంగ బాలబాలికలకు క్రీడా పోటీలు

రాయదుర్గం: మనూలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రారంభించారు. ఇంటర్ హాస్టల్స్ స్పోర్ట్స్, కల్చరల్ అండ్ లిటరరీ పోటీలు, ప్రత్యేకంగా బాలురు, బాలికల కోసం ప్రత్యేక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. క్రీడాకారులను స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్‌జైసీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్‌లు అభినందించారు.

ఐఐఎంసీ విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్‌పై అవగాహన

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైస్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రాజెక్టువర్క్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెడ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ప్రొఫెసర్ చెన్నప్ప మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఉన్న విద్యార్థులకు ప్రాజెక్టు వర్క్‌పై అవగాహన కల్గించే విధంగా కార్యక్రమం దోహపడుతుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఐపీఈ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రాజెక్ట్‌వర్క్‌పై లోతైన అవగాహన కల్గించాలనే ఉద్దేశంతోనే గత కొన్నేళ్లుగా ఈ కళాశాలతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ వంగపల్లి విశ్వనాథం మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో పరిశోధన, నైపుణ్యాలతో పాటు విలువలపై అవగాహన కలుగుతుందన్నారు. గత పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. తెలంగాణలోని మొత్తం 74 కళాశాలల నుంచి 851 మంది విద్యార్థులు కార్యక్రమానికి హాజరయ్యారు.

యువతలో నైపుణ్యం పెంపొందించడమే 'ఎస్కీ' లక్ష్యం

ఐఈఐ అధ్యక్షుడు డా.రంగనాథ్

రాయదుర్గం: యువతలో నైపుణ్యం, పరిజ్ఞానం పెంపొందించడమే 'ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా' లక్ష్యమని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ జి రంగనాథ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన ద్వారా 'ఎస్కీ'లో యువత ఉపాధి శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, సమాచార కేంద్రం నూతన భవనాన్ని ఆయన జ్యోతి వెలిగించి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్కీ స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, రవాణా, పవర్, టెలికమ్యూనికేషన్, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ప్రత్యేక కోర్సులను అందిస్తోందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ మరిన్ని శిక్షణా, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నూతనకుమార్, ప్రతినిధులు ఎం శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎం నాగరాజు, ఎస్కీ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం చౌడేగౌడ్, డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎస్ఎస్ ప్రశాంత్, సీనియర్ అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు, పలు విభాగాలకు చెందిన హెడ్స్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం

మణికొండ: సమస్యల పరిష్కారానికి పరిశోధనలు ఎంతో అవసరమని, వాటికి ప్రభుత్వాలు చాలా నిధులు ఖర్చు చేస్తున్నాయని, వాటిపై విద్యార్థులు దృష్టిపెట్టినపుడే జీవితంలో రాణిస్తారని డిఫెన్స్ మెటలాజికల్ రీసెర్చ్, ల్యాబొరేటరీ(డీఎంఆర్ఎల్) డైరెక్టర్, సైంటిస్ట్ డాక్టర్ ఆర్.బాలమురళీ కృష్ణన్ అన్నారు. గండిపేటలో చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం నుంచి జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ సుధీ–2024 ప్రారంభమయ్యింది. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పర్యావరణం స్థిరత్వం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచన, పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మన సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు యువ ఇంజినీర్లు పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ ఎం.కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సవాళ్లను స్వీకరించి వాటికి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. ఇలాంటి టెక్నికల్ ఫెస్ట్‌లతో విద్యార్థులు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవటంతో పాటు ఇతరుల నైపుణ్యాలను తెలుసుకోవడం, తమ నైపుణ్యాలకు మరింత పదును పెట్టుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సుధీ–2024 చైర్మన్ ప్రొఫెసర్ పి.ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థి సంఘం అధ్యక్షుడు దృష్‌సక్సేనా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రజావాణికి 120 ఫిర్యాదులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజలు అందించే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి కలెక్టరేట్ విభాగం సీ, డీ సెక్షన్ల అధికారులు గీత, భూపాల్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 120 అర్జీలను తీసుకున్నారు. ఇందులో భూవివాదాలు, ధరణి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, అక్రమ కట్టడాలు, భూకబ్జాలు తదితర వాటికి సంబంధించిన ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

టెక్, ఫార్మా సంప్రతి పోస్టర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్: చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి (ఎన్ఎన్ఆర్) కళాశాలలో టెక్, ఫార్మా సంప్రతి పోస్టర్‌ను ఆ కళాశాల కార్యదర్శి సీవీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ నల్లా ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. వచ్చేనెల 21, 22, 23న తేదీల్లో విద్యార్థులు ఈవెంట్లను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టర్ పేపర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్, ఫార్మా క్విజ్‌తో పాటు పలు రకాల పోటీలు నిర్వహిస్తామని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్‌లు, పలు విభాగాల అధిపతులు, టీపీఓ పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలంటే..

ప్రధాని మోదీయే కావాలి

- జాతీయ నేత మురళీధర్‌రావు, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి
- కూకట్‌పల్లిలో విజయ సంకల్ప యాత్రకు హాజరు



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

కూకట్‌పల్లి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి బీజేపీ విజయాన్ని ఆకాంక్షిస్తూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మళ్లీ విజయం సాధించాలని... మోదీ పదేళ్ల పాలనలో దేశాభివృద్ధి కోసం తీసుకొచ్చిన అనేక పథకాలు, చారిత్రాత్మకమైన నిర్ణయాలు, చట్టాలను ప్రజలకు తెలియజేస్తూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న విజయ సంకల్ప యాత్ర కూకట్‌పల్లి నియోజకవర్గానికి సోమవారం చేరుకుంది.

◆ జాతీయ నాయకుడు, మధ్యప్రదేశ్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మురళీధర్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, మేడ్చల్‌జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఈ విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్జునపల్లి సూర్యరావు మాట్లాడుతూ.. విజయ సంకల్ప యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు బీజేపీ ఎల్లవేళలో అండగా ఉంటుందన్నారు. అదే విధంగా దేశం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావాలన్నారు.

◆ దేశం కోసం నిస్వార్థంగా ప్రజాసేవ అనే తపస్సు చేస్తూ భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపే వారి ప్రయత్నంలో మనం కూడా ఆయనతో కలిసి నడవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో అతి పెద్ద హిందూ దేశమైన భారత దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు విస్తరింపజేస్తున్నారని కొనియాడారు. ప్రతి హిందువుకు రక్షణగా భారతదేశం ఉందని భరోసా ఇస్తూ ప్రపంచ మానవాళిలో శాంతిని నెలకొల్పినటువంటి మహోన్నత వ్యక్తి ప్రధాని మోదీ అని పేర్కొన్నారు.రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఒకటే నిర్ణయించుకున్నారని.. గల్లీలో ఎవరున్నానా ఢిల్లీలో మన నరేంద్ర మోదీనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.





చిత్తారమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో చిత్తారమ్మ దేవాలయం పునర్నిర్మాణ పనులను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఆలయ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కార్మికుడికి రూ.1.7లక్షల అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న రవిసింగ్

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ ఇండస్ట్రీ ప్రాంతంలో ప్రభు ఏజెన్సీ, కాంట్రాక్టర్ సర్వేశ్వరరావు వద్ద వెల్డింగ్ పనిచేస్తున్న కార్మికుడు చంద్రశేఖర్ బాలానగర్‌లోని వసంత టూల్స్ కంపెనీలో పనిచేస్తూ కాలుజారి కింద పడ్డాడు. చంద్రశేఖర్‌కు రెండు చేతులకు గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆయనను ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం యజమాని కార్మికుడికి రూ.2.6లక్షలు ఖర్చు పెట్టి శస్త్ర చికిత్స చేయించాడు. అనంతరం బాధితుడి తరపున శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ కాంట్రాక్టర్ సర్వేశ్వరరావుతో మాట్లాడి బెడ్ రెస్ట్, కుటుంబ ఖర్చుల కోసం రూ.1.7లక్షలను ఇప్పించారు. ఈ సందర్భంగా కార్మికుడు రవిసింగ్‌కు ధన్యవాదాలు తెలిపాడు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు మూడు నెలలుగా వేతనాలు అందకపోయినా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ కోశాధికారి ఉన్ని కృష్ణ విమర్శించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ సెంటర్లకు ఆరు నెలలుగా అద్దెలు కూడా చెల్లించడం లేదన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల ఇబ్బందులను సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. గతంలో ప్రభుత్వం ఒప్పుకున్న అంగన్‌వాడీల డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ధర్నాలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.సునీత, ఉపాధ్యక్షురాలు పి.శివరాణి, కోశాధికారి బాలమణి, జిల్లా నాయకురాలు అంజమ్మ, రేణుక, అనిత, సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సీఐటీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నవీన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో 27వ తేదీ ఉదయం 6.30 నుంచి 11గంటల వరకు షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య వైద్య శిబిరం నిర్వహించనున్నారు. అదే విధంగా నీలిమ హాస్పిటల్ వారి సౌజన్యంతో డాక్టర్ వై. అనుపమ ఎంఎస్, గైనకాలజిస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. మహిళలకు ఉచితంగా షుగర్, ప్రెగ్నెన్సీ మహిళలకు టెస్టులు చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్య సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నారు.

ప్రజావాణిలో 40 ఫిర్యాదులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ పరిధిలో పలువురు వారి సమస్యలపై ప్రజా వాణిలో జెడ్‌సీ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదులు అందజేశారు. మూసాపేట నుంచి 7, కూకట్‌పల్లి 2, కుత్బుల్లాపూర్ 8, గాజుల రామారం 7, ఆల్వాల్ 1, కూకట్‌పల్లి జోనల్ 15 మొత్తం 40 మంది నుంచి ఫిర్యాదు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ.. అధికారులు తక్షణమే ఫిర్యాదులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఎంజీఐటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై సదస్సు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ ద్వారా విద్యార్థులకు రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు సాధించి ఉద్యోగాల్లో జరిగే పోటీల్లో ముందు వరుసలో నిలిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సు వారం రోజుల పాటు కొనసాగుతుందని, విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీతమొస్తేనే సాగే.. జీవితం..

- ఎనిమిది నెలలుగా అర్థాకలితో పంచాయతీ కార్మికులు
- జీతాలందక పస్తులుంటున్న కార్మికుల కుటుంబాలు
- పూటగడవడం కూడా కష్టమవుతోందని ఆవేదన
- మిత్తికి తెచ్చుకొని బతుకుతున్నామంటూ వేడుకోలు
- ప్రతినెలా చెల్లించాల్సిన వేతనాలు రూ.4.06 కోట్లు
- 4,779 మంది కార్మికులకు వేతనాలు రాక ఇబ్బందులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతిరోజూ వారు పనిలోకి వస్తేనే పల్లెలు పరిశుభ్రంగా ఉంటాయి. వారు ఒక్కరోజు పనిచేయకపోయినా గ్రామాల్లోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారులూ చెత్తా చెదారంతో నిండిపోతాయి. ఇంటి ముందు చెత్త అలాగే ఉందని విసుక్కుంటాం, ముక్కు మూసుకుంటాం.. తెల్లవారుజామునే వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోనే దినచర్య మొదలయ్యే పేద కార్మికులు వారు. ఆ పారిశుద్ధ్య కార్మికులకు 8 నెలలుగా వేతనం అందక ఇబ్బందులు పడుతున్నారు. లింగాపూర్ తండా పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 8 నెలలుగా జీతాలు రాకపోగా, పూడూరు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి, కోల్తూర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు అందడం లేదు.

కుటుంబ పోషణ భారమై..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 61 గ్రామ పంచాయతీలు ఉండగా, వీరందరికీ గరిష్టంగా ఎనిమిది నెలల నుంచి మూడు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు అర్థాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధులను శుభ్రపరిచే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం శోచనీయం.

వేదన ఇంతా అంతా కాదు..

నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరందరినీ మల్టీపర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు నెలనెలా వారి ఖాతాల్లో జమ అవుతుంటాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను బట్టి 8 నెలల నుంచి 3 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ కాకపోవడం గమనార్హం. జీతాలు అందక వారు పడుతున్న వేదన ఇంతా అంతా కాదు. నగర శివారు మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 619 గ్రామ పంచాయతీల్లో 4,779 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.8,500 చొప్పున రూ.4.06 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 4,002 మంది కార్మికులు పని చేస్తున్నారు. అలాగే, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 777 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూళ్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

త్వరలో వేతనాలు..

పంచాయతీ కార్మికుల వేతనాల అందకపోవడంతో ఇబ్బందిగా ఉందని సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడంతోపాటు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. త్వరలో వేతనాలు అందగలవని భావిస్తున్నారు.



రోడ్డుపై దొరికిన నగదు పీఎస్‌లో అప్పగింత

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డుపై వెళ్తుండగా దొరికిన నగదును కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు సేల్స్ మేనేజర్. కేపీహెచ్‌బీ కాలనీ తనిష్క జ్యువెలరీ షోరూంలో మహేష్‌చారి అనే వ్యక్తి సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజు వైపు వెళుతుండగా రోడ్డుపై పడి ఉన్న నగదును గుర్తించాడు. వెంటనే ఆ నగదును తీసుకొని కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకన్నకు అందజేశాడు. దొరికన నగదును నిజాయితీగా పోలీస్ స్టేషన్‌లో అప్పగించటం పట్ల మహేష్‌చారిని కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న అభినందించారు. నగదు పోగొట్టుకున్న వారు అందుకు సంబంధించిన ఆధారాలు చూపిస్తే నగదును అప్పగించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

హాల్ టికెట్లు ఇవ్వకపోతే కళాశాలలను ముట్టడిస్తాం

బీజేవైఎం నాయకుడు కుమార్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ: ఇంటర్ పరీక్షల నిర్వహణ సందర్భంగా బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ సోమవారం మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా ఇంటర్మీడియట్, కార్పొరేట్ కళాశాలలు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం విద్యార్థులు ఫీజులు కట్టలేదని హాల్ టికెట్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. ఏ ఒక్క విద్యార్థి హాల్ టికెట్ ఇవ్వకపోవటంతో పరీక్షలు రాయకుండా విద్యా సంవత్సరం నష్టపోకూడదన్నారు. హాల్ టికెట్ ఇవ్వకపోతే కళాశాలల ముట్టడికి వెనుకాడబోమని, విద్యార్థులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. అదే విధంగా విద్యార్థులు పరీక్షలను ఆరోగ్యవంతమైన వాతావరణంలో మానసిక ఒత్తిడి లేకుండా రాసే విధంగా కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు ప్రయత్నించాలన్నారు.

వాంబేకాలనీ డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వాంబేకాలనీలో డ్రైనేజీ లైన్ సమస్యగా ఉందని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సోమవారం వాంబేకాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాంబేకాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వాంబే కాలనీలో ఇప్పటికే 160 మీటర్ల డ్రైనేజీ లైన్ మంజూరయ్యిందని అన్నారు. నిర్మాణ పనులు అతి త్వరలో మొదలు పెడతారని తెలిపారు. కాలనీలో ఇంకా ఎంత మేర డ్రైనేజీ లైన్ అవసరం అవుతుందో అంచనా వేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షుడు పాండుగౌడ్, వెంకటేష్, వేణుగోపాల్, నరసింహ, వేణు, శ్రీకాంత్, ముస్తఫా, రమణ తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు రాజకీయాల్లో ఎదగాలి

పంజగుట్ట: దేశంలో సరైన పరిపాలన సాగాలంటే బహుజనులకు రాజ్యాధికారం రావాలని బీఎస్పీ రాష్ట్ర కో– ఆర్డినేటర్, యాంటీ కరప్షన్ బ్యూరో రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ పూర్ణచందర్ రావు అన్నారు. బీసీ సమాజ్, మహాత్మాపూలే ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కుమ్మర (శాలివాహన) రాజకీయ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీసీ సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు, ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవిశంకర్ ప్రజాపతిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీసీ కళామండలి జాతీయ అధ్యక్షులు రామలింగం, శ్రీశైలం శాలివాహన నిత్యాన్నదాన సత్రం అధ్యక్షులు బండారి భిక్షపతి, తెలంగాణ ఉద్యమ నాయకులు మల్లెల రామనాథం, రాచర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో భారత్‌తో భాగస్వామ్యానికి సిద్ధం

ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖ మంత్రి

పంజగుట్ట: ఆస్ట్రేలియా ఆరోగ్యశాఖమంత్రి అంబర్ జడే సాండర్సన్ తన భారత పర్యటనలో భాగంగా సోమవారం నిజాం వైద్య విజ్ఞాన సంస్థలో జరిగిన ఆరోగ్య శిక్షణ శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆస్ట్రేలియా భారత్కి భౌగోళికంగా తేడాలు ఉన్నప్పటికీనీ ఎన్నో అంశాల్లో సారూప్యత ఉందని గుర్తు చేశారు. భారత నర్సింగ్ విద్యార్థులు తమ ఉన్నత విద్య, స్పెషలైజేషన్ కోసం ఆస్ట్రేలియాలో ప్రత్యేక నర్సింగ్ విశ్వ విద్యాలయాల్లో చేరవచ్చని సూచించారు. భారత్‌తో పరస్పర అవగాహన, విజ్ఞాన మార్పిడికి పశ్చిమ ఆస్ట్రేలియా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. నిజాం వైద్య విజ్ఞాన సంస్థ సంచాలకులు డా. నగరి బీరప్ప నిమ్స్‌లో ఉన్న వివిధ విభాగాలు, అందజేస్తున్న వివిధ కోర్సులు, సాధించిన విజయాల గురించి పీపీటీ ద్వారా వివరించారు. డీన్ డా. లిజా రాజశేఖర్ స్వాగతోపన్యాసం చేశారు.

8 నెలల జీతాలు వెంటనే చెల్లించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కొత్తగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం కూడా గ్రామ పంచాయితీ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి కార్మికుల జీతాలు ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో అర్ధాకలికతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేస్తూ మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు రెండు గంటలకు పైగా ధర్నా చేయగా పోలీసులు రంగప్రవేశం చేసి శాంతింపజేశారు. ధర్నా అనంతరం డీఆర్ఓ హరిప్రియకు యూనియన్ రాష్ట్ర, జిల్లా నేతలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు కృష్ణ, శ్రీనివాస్, సుగుణ, రవి, నరసింహ, శ్రీకాంత్‌తో పాటు గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.